సాక్షి
జగిత్యాల
ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



శ్రావణ సందడి
కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి సన్నిధిలో శ్రావణ చివరి శనివారం వేలాది మంది భక్తులు పూజలు చేశారు.



నృసింహునికి పూజలు
ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి ప్రధాన, అనుబంధ ఆలయాల్లో శ్రావణంలో చివరి శని వారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది.

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
29.0/24.0
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేసుల పరిష్కారంలో రాజీమార్గమే ఉత్తమం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి నీలిమ

జగిత్యాలక్రైం: కేసుల పరిష్కారంలో రాజీమార్గమే ఉత్తమమని జిల్లా జడ్జి నీలిమ అన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. పలు కేసుల్లో కక్షిదారులు రాజీ కుదుర్చుకోవడంతో వాటిని మెజిస్ట్రేట్ పరిష్కరించారు. ఈ సందర్భంగా 11,429 కేసులను పరిష్కరించారు. ఇందులో 32 సివిల్, 19 యాక్సిడెంట్ క్లెయిమ్స్‌లో రూ1.22 కోట్లు పరిహారం ఇప్పించారు. అనంతరం జడ్జి మాట్లాడారు. పంతాలకు పోకుండా లోక్ అదాలత్‌లో సమస్యలను పరిష్కరించుకోవడానికి కక్షిదారులు ముందుకు రావాలని జడ్జి సూచించారు. తద్వారా సమయం ఆదా అవుతుందని అన్నారు. ఆర్థిక సమస్యలు ఉండవని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రసాద్, జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ టి.జితేందర్, సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వినీల్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, చీఫ్ లీగల్ అడ్వైజర్ కట్కం చంద్రమోహన్ పాల్గొన్నారు.

దుర్గమ్మ చీర కోసం 2.5 కిలోల వెండి వితరణ

కోరుట్ల: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం వద్ద ఉన్న దుర్గామాత దేవాలయంలోని అమ్మవారికి వెండిచీర తయారీ కోసం వాసం రణధీర్ 2.5 కిలోల వెండిని విరాళంగా అందించారు. తన పిల్లలు శ్రీనిక, యువాంశ్, స్మార్థస్, ఈశస్ పేరిట శుక్రవారం రాత్రి కౌన్సిలర్ పెండెం గణేశ్, కొక్కుల నడిపి గంగాధర్‌కు వెండి అందజేశారు. ఆయనను పట్టణవాసులు అభినందించారు. కార్యక్రమంలో వాసం శివప్రసాద్, భారతి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వందశాతం టీకాలు వేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

మల్యాల(చొప్పదండి): చిన్నారులకు ఇచ్చే టీకాలు, నమోదు తేదీలు యూ విన్ యాప్‌లో నమోదు చేయాలని, తద్వారా నూరుశాతం వ్యాక్సినేషన్ పూర్తవుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి శ్రీధర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యూ విన్ యాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. యాప్‌లో వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని చెప్పారు. యాప్ శిక్షకులు అంజిత్‌రెడ్డి వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మౌనిక, నరేశ్ డీపీఎంవో దేవీసింగ్, పీహెచ్ఎన్ నాగలక్ష్మి, సూపర్‌వైజర్ సునంద, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా పేరు నమోదు చేయాలి



అవగాహన కల్పిస్తున్న లక్ష్మీనారాయణ

జగిత్యాలరూరల్: జిల్లాలో 18 ఏళ్ల వయసు నిండిన ప్రతీఒక్కరు ఓటరుగా పేరు నమోదు నమోదు చేసుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్, అనంతారం గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఓటరుగా నమోదుకాని వారు ఫారం–6 ద్వారా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. సర్పంచులు ఎల్ల గంగానర్సు, జంగ జలేందర్, ఏపీఎం గంగాధర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సీసీలు గంగారాం, సంతోష్, మహిళా సంఘాల అధ్యక్షులు శ్రీలత, సుకన్య, లత తదితరులు పాల్గొన్నారు.

పేరు నమోదు చేసుకోండి

జగిత్యాల: ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని నోడల్ అధికారి లక్ష్మీనారాయణ సూచించారు. బస్టాండ్ ప్రాంతంలో కళాజాత బృందాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అధికారులు పర్శురాంగౌడ్, మహిపాల్, రాజేందర్, పోచయ్య పాల్గొన్నారు.

కోల్‌కతా టు కోరుట్ల



అందంగా రూపుదిద్దుకున్న మట్టి వినాయక విగ్రహాలు

సండే స్పెషల్

- ఆకట్టుకునే కళానైపుణ్యం
- అందమైన విగ్రహ రూపం
- పక్కాగా పర్యావరణ పరిరక్షణ
- తరలివస్తున్న మట్టి విగ్రహాలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి గణపతి విగ్రహం

కోరుట్ల: తీర్చిదిద్దిన కళానైపుణ్యం.. ఉట్టిపడే జీవకళ.. ఆకట్టుకునే రంగులతో అద్దుకున్న సొబగులు.. అందంగా తయారైన మట్టి వినాయక విగ్రహాలు.. కోల్‌కతా నుంచి కోరుట్లకు తరలివస్తున్నాయి. స్థానికంగా లభించే మట్టి.. విగ్రహాల తయారీకి అనుకూలంగాలేదు.. మట్టితో శిల్పాలు మలిచే నైపుణ్యంగల కళాకారులు అందుబాటులో లేదరు.. ఫలితంగా పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఈసారి కూడా మట్టి వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించేవారి అభిరుచులకు అనుగుణంగా వ్యాపారులు కోల్‌కతా నుంచి తెప్పిస్తున్నారు.

పర్యావరణ హితం గంగమట్టి..

- కోల్‌కతాను ఆనుకుని ప్రవహించే గంగానదిని అక్కడి స్థానికులు హుగ్లీ నదిగా పిలుస్తారు.
- దీని పరీవాహక ప్రాంతాల్లో లభించే మట్టిని స్వచ్ఛమైన 'క్లే'(బంకమట్టి) మట్టిగా చెబుతారు.
- మలినాలు లేని ఈ బంకమట్టి వినాయక విగ్రహాల తయారీకి ప్రసిద్ధిగా పేర్కొంటున్నారు.
- దీంతో విగ్రహాల తయారీ ఎలాంటి లోటుపాట్లు లేకుండా, పర్యావరణ హితంగా ఉంటోంది.
- ఈమట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలను మళ్లీ నీటిలో ముంచితే తేలికగా కరిగి ప్రవాహంలో కలిసిపోతాయని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.
- ఈక్రమంలోనే స్థానికంగా దొరికే మట్టి విగ్రహాలు నాణ్యత, పర్యావరణపరమైన స్వచ్ఛత తక్కువగా ఉండడంతో కోల్‌కతా నుంచి తెప్పించే మట్టి విగ్రహాలకు జిల్లాలో మంచి గిరాకీ ఉంటోంది.

ఉట్టిపడే జీవకళ.. ఆకట్టుకునే రంగులు ..

కోల్‌కతా శిల్పకళాకారులు వినాయక విగ్రహాల తయారీలో మంచి ప్రావీణ్యం ఉన్నవారు. దీంతో వారి చేతుల్లో జీవం పోసుకున్న విగ్రహాల్లో జీవకళ ఉట్టిపడుతోంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ మూసల్లో పోసి తయారు చేసే విగ్రహాల కన్నా కోల్‌కతా మట్టితో తయారైన విగ్రహాలు ఎంతో అందంగా ఉండటం విశేషం. దీనికితోడు కేవలం మట్టి వినాయక విగ్రహాలే కాకుండా రంగులతో అద్ది సుందరంగా రూపొందిన వినాయక విగ్రహాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. కలకత్తా నుంచి కంటెయినర్లలో భద్రంగా కోరుట్లకు మట్టి వినాయక విగ్రహాలు తరలించి హోల్‌సేల్, రిటెయిల్‌గా విక్రయిస్తున్నారు.

మట్టి గణపతులకు జై..



ఆకట్టుకుంటున్న మట్టి విగ్రహం



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న సభ్యులు

జగిత్యాలటౌన్: పట్టణ ప్రజలు మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈక్రమంలో స్థానిక మార్కండేయ ఆలయంలో పదేళ్లుగా ఏటా మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా సత్యసాయి సేవా సమితి, విశ్వహిందూ పరిషత్ లాంటి ధార్మిక, స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా మట్టితో తయారుచేసిన గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్నాయి. వీటి ఏర్పాటు ద్వారా కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయి. ఆస్పత్రులు, వ్యాపార సంస్థల్లోనూ మట్టి గణపతి విగ్రహాలు ఏర్పాటు చేసి నిత్యపూజలు చేస్తున్నారు.

మట్టి విగ్రహాలనే పూజిస్తున్నాం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేస్తున్న వినాయక విగ్రహాలతో జల, వాయు కాలుష్యం ఏర్పడుతోంది. ఈ ముప్పును తగ్గించేందుకు ఏటా మా సంస్థ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నాం. మట్టితో తయారు చేసే విగ్రహాల ఆవశ్యకతపై ఇదే సమస్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– బట్టు రాజేందర్, సత్యసాయి సేవా సమితి కన్వీనర్

పీవోపీతో సమస్యలు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన గణపతి విగ్రహాలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తే నీరు కలుషితమవుతుంది. జలచరాలు, పశువులు వ్యాధుల బారినపడతాయి. పంటలు దెబ్బతింటాయి. మట్టితో తయారుచేసిన విగ్రహాలతో ఎలాంటి హాని ఉండదు.

– సురేశ్‌కుమార్, డాక్టర్

అవగాహన పెరిగింది



పర్యావరణంపై చాలామందిలో అవగాహన పెరిగింది. యువజన సంఘాలు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించడానికి ఆసక్తి చూపుతున్నాయి. కోల్‌కతాలోని గంగమట్టి పవిత్రమైందిగా పేరుగాంచింది. ఈ మట్టితో తయారైన వినాయకుడి విగ్రహాలను పూజించడం శ్రేష్ఠమనే ప్రచారం ఉంది. ఈసారి మట్టి విగ్రహాలకు మంచి గిరాకీ ఉంది. 4 ఇంచుల నుంచి 8 అడుగుల ఎత్తువరకు మట్టి విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. ఒక్కోవిగ్రహం ధర రూ.30 వేల నుంచి రూ.12వేల వరకు ఉంది.

– తాటిపాముల శ్రీనివాస్, మట్టి వినాయక విగ్రహాల వ్యాపారి, కోరుట్ల



మట్టి విగ్రహం

ఆభరణాలు చోరీ చేశారా?

- ఫౌండర్ ట్రస్టీ మారుతీస్వామి సస్పెన్షన్
- అంజన్న ఆలయ వర్గాల్లో చర్చనీయాంశం



మారుతీస్వామి

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో ఆగస్టు 9న హుండీల్లోని సొమ్ము లెక్కించారు. ఆ సమయంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ తిరుకోవేళూర్ మారుతీస్వామి ఆభరణలు చోరీ చేశారని బోర్డు సభ్యుడు జున్న సురేందర్ అదేనెల 16న ఈవో వెంకటేశ్, 17న రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు.. అదేనెల 19న దేవాదాయ శాఖ ఏడీసీ కృష్ణవేణిని విచారణకు పంపించారు. ఆమె ఆలయ పరిసరాలు పర్యవేక్షించారు. కొండపై పోలీస్ ఔట్‌పోస్టులోని సీసీ కెమెరాలు తనిఖీ చేశారు. అక్కడి సీసీ ఫుటేజీలు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఫౌండర్ ట్రస్టీ మారుతీస్వామిని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేసినట్లు ఈవో వెంకటేశ్ శనివారం తెలిపారు. పాలకవర్గం నుంచి ఆయనను సస్పెండ్ చేశారు. ఈమేరకు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆ మెమోను ఆలయం వెనకాల ఉన్న చైర్మన్ ఇంటి బయట గోడకు అధికారులు శనివారం అంటించారు. కాగా, సస్పెన్షనే కాకుండా.. శిక్షపడే వరకూ తాను విశ్రమించబోనని బోర్డు సభ్యుడు జున్న సురేందర్ తెలిపారు.

'డబుల్ ఇళ్లకేనా' పారదర్శకత?



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: రాజకీయ జోక్యం, అవినీతికి తావు లేకుండా కంప్యూటర్ ఆధారంగా పూర్తిపారదర్శకంగా డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని మంత్రి కేటీఆర్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే, ఇది దళితబంధుకు కూడా వర్తింపజేస్తారా? లేదా? వెల్లడించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఇందిరాభవన్‌లో శనివారం జీవన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో అర్హత ప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్లతోపాటు అనేక సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులను ఎంపిక చేశామని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు అనుసరిస్తున్న విధివిధానాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొత్త మోహన్, బండ శంకర్, విజయలక్ష్మి, దేవేందర్‌రెడ్డి, కల్లెపెల్లి దుర్గయ్య, నక్క జీవన్, గాజుల రాజేందర్, జున్ను రాజేందర్, ధర రమేశ్, గుండ మధు, బొల్లి శేఖర్, రాధాకిషన్, దాసరి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు ప్రభుత్వం అండ

- మంత్రి కొప్పుల ఈశ్వర్



కుట్టుమిషన్లు అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: సీఎం కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా దాని వెనుకాల మానవీయ కోణం ఉంటుందని, అన్నివర్గాలకు ముఖ్యమంత్రి అండగా ఉంటారని సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం స్థానిక విరూపాక్షి గార్డెన్స్‌లో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ, మైనారిటీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న షాదీముబారక్ పథకం ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, రవిశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ పాల్గొన్నారు.

వీరవనిత చాకలి ఐలమ్మ

వెల్గటూర్(ధర్మపురి): తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో నిప్పురవ్వ చాకలి ఐలమ్మ అన్నారు. త్యాగానికి మరోపేరు అని, ఆమె స్ఫూర్తితో పోరాడి తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పొన్నం స్వరూప, మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, ఎండపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సింహాచలం జగన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో పటిష్ట నిఘా

- అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తు చర్యలు
- ఆరు జిల్లాల పోలీసు అధికారులు, మహారాష్ట్ర పోలీసుల ఉన్నతస్థాయి సమీక్ష



మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ

జగిత్యాలక్రైం: రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులు, జిల్లాల సరిహద్దుల్లో చేపట్టే పకడ్బందీ చర్యలపై శనివారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి సాలూర రోడ్డులోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో మహారాష్ట్ర పోలీసులతోపాటు, రాష్ట్రంలోని ఆరు జిల్లాల ఎస్పీల సమావేశం జరిగింది. సమావేశంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, పటిష్ట నిఘా పెట్టాలన్నారు. మద్యం, నగదు సరఫరాపై నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణాను నియంత్రించాలన్నారు. నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, కామారెడ్డి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నాందేడ్ జిల్లాల సరిహద్దుల్లోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేయాలని అన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చెక్ పోస్టులను ఏర్పాటు చేసుకొని నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్ల విషయంలో అన్నిజిల్లాల, రాష్ట్రాల అధికారులు సహకరించుకుంటూ ముందుకు వెళ్లాలని అన్నారు. అంతర్రాష్ట్ర చెక్ పోస్టులైన సాలూర, కంద్గావ్, కందకుర్తి, పోతంగల్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటితోపాటు అంతర్‌జిల్లా చెక్ పోస్టులు డోన్గాన్(సోన్) బ్రహ్మంగారి గుట్ట, సిరికొండ, ఇందల్వాయి టోల్‌ప్లాజా, మల్లారం గండి, యంచ(బాసర) వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. గతంలో అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, వారిని నియంత్రించడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. సరిహద్దుల్లో హైవే పెట్రోలింగ్, మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని, పోలీస్ అధికారులు వాట్సప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని పేర్కొన్నారు. ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పర సహాయ సహకారాలు అందించుకుంటూ ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల ఎస్పీలు ఎస్పీ డి.ఉదయ్‌కుమార్, ప్రవీణ్ కుమార్, భాస్కర్, బి.శ్రీనివాస్, నాందేడ్ జిల్లా(బోకర్) అదనపు ఎస్పీ కే ఏ ధరణి, నిజామాబాద్ జిల్లా అదనపు డిప్యూటీ కమిషనర్ జయరామ్, నిజామాబాద్ జిల్లా కమర్షియల్ ట్యాక్స్ అధికారి లావణ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఉన్నారు.

జిల్లాకు చేరిన బతుకమ్మ చీరలు

- నాలుగు గోదాముల్లో భద్రపరిచిన అధికారులు



రైతువేదికలో భద్రపరిచిన బతుకమ్మ చీరలు

కథలాపూర్(వేములవాడ): బతుకమ్మ చీరలు జిల్లాకు చేరాయి. వచ్చే నెలలో బతుకమ్మ పండుగ ఉంది. అయితే, వారం రోజుల ముందే మహిళలకు బతుకమ్మ చీరలను పండుగ కానుకగా అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకు వచ్చిన బతుకమ్మ చీరలను గోదాముల్లో భద్రపరిచాలని అధికారులు నిర్ణయించారు.

జిల్లాకు 3.50 లక్షల చీరలు అవసరం..

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాల్లో 380 గ్రామాలు ఉన్నాయి. ఆహారభద్రత కార్డులో పేరు ఉండి 18 ఏళ్లు నిండిన మహిళలకు బతుకమ్మ చీరలను అందించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈమేరకు సివిల్ సప్లయ్ అధికారుల నుంచి వివరాలు సేకరించిన సెర్ప్, మెప్మా అధికారులు.. జిల్లాకు 3.50 లక్షల బతుకమ్మ చీరలు అవసరమని ఉన్నతాధికారులకు నివేదించారు. దీని ఆధారంగా బతుకమ్మ చీరలను ప్రభుత్వం జిల్లాకు సరఫరా చేసింది. జిల్లాలోని జగిత్యాల, మెట్‌పల్లి, ధర్మపురి, కథలాపూర్ కేంద్రాలుగా గోదాం పాయింట్‌లు గుర్తించి ఐదు మున్సిపాలిటీలకు, ఆయా మండలాలకు సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాకు వచ్చిన బతుకమ్మ చీరలను నాలుగు గోదాం పాయింట్‌లలో భద్రపరిచినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు 50 శాతం చీరలు జిల్లాకు చేరాయని, మిగతావి త్వరలోనే వస్తాయని సెర్ప్ డీపీఎం మాణిక్‌రెడ్డి తెలిపారు.

కాళోజీ ఆశయ సాధనకు కృషి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: కాళోజీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. శనివారం పట్టణంలోని ఎల్ఎల్ గార్డెన్స్‌లో తెలుగు భాషా అభ్యాసనాభివృద్ధి సమితి ఆధ్వర్యంలో పద్మ విభూషణ్ కాళోజీ జయంతి ఘనంగా నిర్వహించారు. భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కృషితో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఉన్నా.. తెలుగులో సైతం పాఠ్యపుస్తకాలు ముద్రిస్తున్నారని తెలిపారు. అనంతరం లాంగ్వేజ్ లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ఫోరం ఫర్ తెలుగు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, తెలుగు భాష అభ్యాసన అభివృద్ధి సమితి సభ్యులు రాజ్‌కుమార్, చంద పృథ్వీ, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్‌కు స్వాగతం

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇషాక్ జగిత్యాల పర్యటనకు రాగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాళోజీ జీవితం ఆదర్శం

జగిత్యాలరూరల్: కాళోజీ జీవితం, జీవన విధానం భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జెడ్పీ కార్యాలయంలో శనివారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ రాంమోహన్, ఆర్ఐలు భూమయ్య, సీనియర్ అసిస్టెంట్ సురేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: కారును అజాగ్రత్తగా నడిపి ఇద్దరిని ఢీకొట్టిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఏఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన పులి శివ, సూర రమేశ్ శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, తహసీల్ చౌరస్తా వద్ద సిరికొండ అంజయ్య అతివేగంగా, అజాగ్రత్తగా కారు నడిపి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈప్రమాదంలో శివ, రమేశ్‌కు గాయాలయ్యాయి. శివ సోదరుడు పులి శ్రీను ఫిర్యాదు మేరకు అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

బెల్ట్‌షాప్ నిర్వహణకు వేలం?

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం పెగ్గెర్ల గ్రామంలో అక్రమంగా బెల్ట్‌షాప్ నిర్వహించేందుకు శనివారం వీడీసీ సభ్యులు గ్రామశివారులో వేలం నిర్వహించినట్లు సమాచారం. ఓ వ్యక్తి ఏడాదిపాటు బెల్ట్‌షాప్ నిర్వహించేందుకు వేలంలో రూ.40 వేలు చెల్లించి చేజిక్కించుకున్నాడని తెలిసింది. అంతేకాకుండా గ్రామంలో చికెన్ సెంటర్ ఒక్కరే నిర్వహించాలని వేలం నిర్వహించగా రూ.20 వేలు చెల్లించి ఓ వ్యక్తి దక్కించుకున్నాడని సమాచారం. ఏదేమైనా గ్రామాల్లో బెల్ట్‌షాప్ నిర్వహించడమే అక్రమమని, అటువంటిది బహిరంగంగా వేలం నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు దృష్టిసారించి అక్రమ వ్యాపారాలు నిర్వహించేవారిపై, వాటిని ప్రోత్సహించేవారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కువైట్‌లో రాయికల్‌వాసి మృతి


హమీద్‌ఖాన్ (ఫైల్)

రాయికల్(జగిత్యాల): రాయికల్ పట్టణానికి చెందిన మహ్మద్ హమీద్‌ఖాన్ (45) కువైట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. హమీద్ ఖాన్ ఉపాధి నిమిత్తం పదినెలల క్రితం కువైట్‌లో హౌస్‌డ్రైవర్‌గా చేరాడు. తన ఇంటి యజమానిని ఆఫీసులో దింపి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని మైనార్టీ నాయకులు కోరారు.


కూతురిపై అత్యాచారం

కథలాపూర్(వేములవాడ): జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో తన కూతురు(17)పై తండ్రి అత్యాచారం చేశాడు. ఈ సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. మద్యానికి బానిసైన తండ్రి.. ఆ మత్తులో కన్నకూతురుపై అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని తన తల్లికి చెప్పడంతో బాలికను వెంటనే బంధువులు తమ ఇంటికి తీసుకెళ్లారు. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు బాలిక తండ్రిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని రంగపేట గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్న ముగ్గురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి, వారి నుంచి రూ.5,620 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పల్లెచిత్రాల 'తోట'



- వైకుంఠం గీసిన చిత్రాలకు క్రేజీ
- వేలం పాటలో కోటిన్నర పలికిన పైనం
- ఆకట్టుకుంటున్న బూర్గుపల్లి వైకుంఠం కళాఖండాలు
- ఎన్నో అవార్డులు.. మరెన్నో పురస్కారాలు


చిత్రం గీస్తున్న వైకుంఠం

బోయినపల్లి(చొప్పదండి): పల్లె జీవనం.. పడచుల కట్టుబొట్టు.. భారతీయ సంస్కృతి.. ఆయన చిత్రాలకు మూలాధారం. తోట వైకుంఠం కుంచె పడితే చిత్రాలకు జీవం వచ్చి, కాన్వాస్‌పై నాట్యం చేస్తాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం బూర్గుపల్లిలో జన్మించిన వైకుంఠం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాడు. ఏడేళ్ల క్రితం గీసిన చిత్రానికి ఇటీవల ముంబయిలోని ఆస్తాగురు యాక్షన్ హౌస్ నిర్వహించిన వేలంలో రూ.1,41,35,220 ధర పలకడం విశేషం.

బూర్గుపల్లిలో విద్యాభ్యాసం

బూర్గుపల్లిలో 1942లో జన్మించిన తోట వైకుంఠం స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. బోయినపల్లి, శాత్రాజ్‌పల్లి, వేములవాడ, సిరిసిల్లలో ఉన్నత విద్య చదివారు. హైదరాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో చిత్రలేఖనం పూర్తి చేశారు. అనంతరం మహారాజ సయాజీరావు యూనివర్సిటీ ఆఫ్ బరోడాలో ప్రముఖ చిత్రకళాకారుడు సుబ్రమణియన్ దగ్గర శిష్యరికం చేశారు.

రంగుల ఆయన ప్రత్యేకత

డస్కీస్కిన్‌తో మహిళల చిత్రాలు గీయడం ఆయన ప్రత్యేకత. సాదాగా కనిపించే మహిళలు రూపం ఆయన చిత్రంగా మలిస్తే అందంగా కనిపిస్తారు. ఆయన గీసిన అందమైన మహిళల చిత్రాలను సిరిసిల్ల చీరెలుగా అభివర్ణిస్తారు.

అమ్మ.. మహిళలే స్ఫూర్తి

చిత్రకారుడిగా గుర్తింపు పొందడానికి అమ్మ స్ఫూర్తి అని వైకుంఠం చెబుతుంటారు. చిన్నప్పుడు గ్రామంలో చిందు కళాకారులు నాటకాలు ప్రదర్శిస్తుంటే వారు వేసిన వేశాలకు తగినట్లుగా మేకప్ వేసి రంగులు దిద్దే అలవాటు ఉండేదని తెలిపారు. అలా చిన్నప్పటి నుంచే రంగులు, బొమ్మలు గీయడంపై అనురక్తి కల్గిందని చెబుతుంటారు. ఎరుపు, ఆకుపచ్చ, నీలం రంగులు తనకు ఇష్టమని.. తన చిత్రాలలోనూ ఎక్కువగా వాటినే వాడుతానని తెలిపారు.

ఎన్నో అవార్డులు

భోపాల్‌లో రెండేళ్లకోసారి ఇచ్చే భారత్ భవన్ అవార్డుతోపాటు భారత ప్రభుత్వం అందించే జాతీయ అవార్డు, ఉమ్మడి రాష్ట్రంలో హంస అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉత్తమ చిత్రకళాకారుడిగా అవార్డు లభించింది. దాసి, మాభూమి చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా పనిశారు. దాసి చిత్రానికి ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్‌గా జాతీయ అవార్డు అందుకున్నారు.

వైకుంఠంపై పలు డాక్యుమెంటరీలు

వైకుంఠంపై పలు డాక్యుమెంటరీలు వచ్చాయి. 2015లో కోల్‌కతాకు చెందిన పార్థూరాయ్ డాక్యుమెంటరీ నిర్మించారు.

గ్రామాభివృద్ధికి విరాళాలు

స్వగ్రామం బూర్గుపల్లిలో పాఠశాల అభివృద్ధికి రూ.40 వేలు విరాళంగా అందించారు. యువత చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని తెలుపుతున్నారు.

మాకు గర్వంగా ఉంది



అంతర్జాతీయ చిత్రాకారుడిగా పేరు పొందిన తోట వైకుంఠం మా గ్రామస్తుడని చెప్పుకోవడం గర్వంగా ఉంది. ఆయనతో మా గ్రామానికి పేరు రావడం గొప్పగా భావిస్తున్నాం. ముంబయిలో జరిగిన వేలంలో ఆయన గీసిన చిత్రానికి కోటిన్నర పలకడం చాలా సంతోషంగా ఉంది.
– కమటం అంజయ్య,మాజీ సర్పంచ్, బూర్గుపల్లి

చిందు నాటకాలు ఇష్టపడేవారు



వైకుంఠం సారు చిన్నప్పుడు మా గ్రామంలో చిందునాటకాలు వేసేవారు. పదేళ్ల కింద గ్రామానికి వచ్చినప్పుడు పాతతరం చిందు కళాకారులతో వేశాలు వేయించి డాక్యుమెంటరీ తీశారు. చిందుకళను ఇష్టపడేవారు.
– గజ్జెల సాయిలు,చిందు కళాకారుడు

గ్రామాభివృద్ధికి తోడ్పాటు



తోట వైకుంఠం గ్రామంలో యువతకు స్ఫూర్తినిచ్చే వ్యక్తి. స్వగ్రామంలోని పాఠశాల అభివృద్ధికి గతంలో రూ.40 వేలు సాయం చేశారు. ఆయన గీసిన చిత్రాలతో మా ఊరికి పేరు రావడం గర్వంగా ఉంది.
– పెరుక మహేశ్, యువకుడు

మంచంపట్టిన పల్లెలు


చికిత్స పొందుతున్న నర్సయ్య


చికిత్స పొందుతున్న సిరిపురం దీపక్


జ్వరాలతో నిర్మానుష్యంగా మారిన కోనాపూర్ గ్రామంలోని వీధి

- కోనాపూర్, పెంబట్ల గ్రామాల్లో విషజ్వరాల విజృంభణ

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని కోనాపూర్, పెంబట్ల గ్రామాల్లో డెంగీ జ్వరాలతో ప్రజలు సతమతమవుతున్నారు. కోనాపూర్ ఎస్సీ, బీసీ కాలనీ, పెంబట్ల గ్రామంలోని బుడగజంగాల కాలనీ వాసులు జ్వరాలతో ఇబ్బందిపడుతున్నారు. 15 రోజులుగా జ్వరాలు విజృంభిస్తుండటంతో బాధితులు ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. కోనాపూర్ ఎస్సీ, బీసీ కాలనీలో ఇప్పటికే డెంగీ జ్వరంతో రక్తకణాలు తగ్గి చికిత్స పొందుతూ సుద్దాల పోశయ్య, బాపురపు పోషవ్వ మృతిచెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

కాలనీవాసులందరికీ జ్వరాలు

కోనాపూర్ గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలో ఒకటిగానే ఉంటుంది. ఇక్కడ దాదాపు 60 కుటుంబాలు ఉండగా ప్రతీ కుటుంబంలోని అందరూ జ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో ఈ కాలనీ పొద్దంతా నిర్మానుశ్యంగా కనిపిస్తోంది. అలాగే పెంబట్ల బుడగజంగాల కాలనీలో ఎక్కువ మంది జ్వరపీడితులు ఉన్నారు. ఇక్కడ కూడా ప్రతి రెండిళ్లకు ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. పెంబట్లకు చెందిన దుబ్బ రాజన్న ఆలయ అర్చకుడు శానగొండ మధు డెంగీతో జగిత్యాలలో చికిత్స పొందగా, పరిస్థితి విషమించడంతో శనివారం హైదరాబాద్‌కు తరలించారు.

వైద్యానికి చాలా ఖర్చయింది



నాకు డెంగీ వచ్చింది. వారం రోజులు జగిత్యాల ప్రైవేటు ఆస్పత్రిలో ఉన్నా. దాదాపు రూ.30 వేల వరకు ఖర్చయింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నా. గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి. క్లోరినేషన్ చేయించాలి.
– చంద శ్రీహరి, కోనాపూర్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు



జ్వర పీడితులు సాధారణ జ్వరం అయినా ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ అని చేరుతూ అనవసరంగా ఎక్కువ ఖర్చు చేసుకుంటున్నారు. కోనాపూర్‌లో మృతిచెందిన వారిలో ఒకరికి జ్వరంతోపాటు గుండెపోటు రావడంతో చనిపోయాడు. పెంబట్ల, కోనాపూర్ గ్రామాల్లో విస్తృతంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. మరిన్ని ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తాం.
– డాక్టర్ జయపాల్‌రెడ్డి మాతాశిశు సంరక్షణాధికారి

ఇంటింటా వైద్య పరీక్షలు


ఇంటింటా వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సారంగాపూర్(జగిత్యాల):మండలంలోని కోనాపూర్, పెంబట్ల గ్రామాల్లో డెంగీతో పాటు, జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయన్న దానిపై మండల వైద్యశాఖ శనివారం శిబిరాలు ఏర్పాటు చేసింది. మండల వైద్యాధికారి డాక్టర్ రాణిమైత్రిరెడ్డి ఆధ్వర్యంలో కాలనీల్లో ఇంటింటా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకోవాలని, అక్కడ ఆధునిక వైద్యసౌకర్యాలు, డెంగీని అదుపు చేసే పరికరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు. రెండు గ్రామాల్లో మరిన్ని వైద్యశిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆమె వెంట సర్పంచులు ఆకుల జమున, బొడ్డుపల్లి రాజన్న, వైద్యసిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల ప్రక్రియ


దరఖాస్తు అందజేస్తున్న భోగ శ్రావణి

జగిత్యాలటౌన్: జగిత్యాల అసెంబ్లీ బీజేపీ స్థానానికి తనకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ సమర్పిస్తున్న ఆశావహుల దరఖాస్తుల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. శనివారం జగిత్యాలకు చెందిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జున్ను రాజేందర్ దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అనుక్షణం అప్రమత్తతతో పనిచేస్తూ, పార్టీకి క్రమశిక్షణ గల సైనికులుగా పనిచేస్తున్న తమ సీనియారిటీ, సిన్సియారిటీని పరిగణనలోకి తీసుకుని అవకాశం కల్పించాలని పార్టీ పెద్దలను కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌తో పాటు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నీరుగారుతున్న దళితబంధు లక్ష్యం


సమావేశంలో నాయకులు

మేడిపెల్లి(వేములవాడ): దళితబంధు లక్ష్యం నీరుగారుతోందని దళిత, బహుజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. భీమారం మండల పరిధిలో స్ప్రైస్ యూనిట్ అవకతవకల నేపథ్యంలో దళిత బంధు భవిష్యత్ కార్యాచరణపై శనివారం మండల కేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక నాయకత్వ నియంతృత్వ ఆజమాయిషీ ఎక్కువై దళితబంధు లబ్ధిదారులు బాధపడుతున్నారని పేర్కొన్నారు. లబ్ధిదారులకే యూనిట్లు చెందేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, లేకుంటే దళిత, బహుజన సమాజాన్ని ఏకం చేసి పోరాటం చేస్తామన్నారు. ఈ అంశంపై సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తామని, తక్షణమే న్యాయం చేయకుంటే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడుతామని పేర్కొన్నారు. సమావేశంలో బీఎస్పీ మేడిపెల్లి మండల అధ్యక్షుడు ఎర్రల రాజేశ్, భీమారం మండల అధ్యక్షుడు ఏనుగంటి హరీశ్, డీఎస్పీ మండల అధ్యక్షుడు సుంకపాక కోటేశ్, బహుజన ఉద్యమకారులు గుగ్గిళ్ల రవిగౌడ్, కోటగిరి లింగం, వినయ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నవీన్‌కుమార్

మల్లాపూర్: రానున్న రోజుల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్ అన్నారు. మల్లాపూర్, మొగిలిపేట, కొత్తదాంరాజ్‌పల్లి, సిరిపూర్, వాల్గొండ గ్రామాలకు చెందిన సుమారు 400 మందికి శనివారం బీజేపీలో చేరగా, కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ సుఖేందర్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'మేరీ మాటీ మేరా దేశ్'

పెగడపల్లి: మండలంలోని నంచర్లలో బీజేపీ నాయకులు శనివారం రిటైర్డ్ జవాన్ లక్ష్మారెడ్డి ఇంటి వద్ద మట్టి సేకరించారు. అనంతరం రామాలయంలో పూజలు చేసి మాట్లాడారు. అమర జవాన్లు, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పౌరులను గౌరవించుకోవడం కోసం దేశవ్యాప్తంగా మేరీ మాటీ మేరా దేశ్ (నా మట్టి..నా దేశం) పేరుతో వివిధ ప్రాంతాల నుంచి పవిత్ర మట్టిని సేకరించి ఢిల్లీలో అమృత్ వాటికను నిర్మించేందుకు మట్టిని తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కొమురెల్లి, నాయకులు తిరుపతి, బాబు, జనార్దన్, లతీశ్, విద్యాసాగర్, నాగేంద్రబాబు, వరుణ్, అభిలాష్ పాల్గొన్నారు.

'శ్రీరామకోటి'కి మోక్షమెప్పుడో?

- పనులు పూర్తయినా ప్రారంభం కాని స్తూపం


శ్రీరామకోటి స్తూపం స్టాండ్‌లపై బట్టలు ఆరవేత

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న సన్నిధిలో నిర్మించిన శ్రీరామకోటి స్తూపం ప్రారంభానికి నోచుకోవడం లేదు. స్తూపం నిర్మాణానికి సుమారు రూ.38 లక్షల సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్)నిధులతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తదితరులు శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయి 5నెలలు గడుస్తున్నా ప్రారంభించడంలో దేవాదాయ శాఖ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.38 లక్షల సీజీఎఫ్ నిధులతో..

ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక చొరవతో కొండపై స్తూపం నిర్మాణానికి మోక్షం లభించింది. ముందుగా రూ.50లక్షల వ్యయంతో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయగా, చివరకు రూ.38లక్షలతో పూర్తి చేశారు. ఈనేపథ్యంలో వాస్తు సలహాదారులు పరిశీలించి సరైన ప్రాంతంలో నిర్మించలేదని అధికారులు, అర్చకులకు తెలిపారు. కాగా అప్పటికే 80శాతం పనులు పూర్తయ్యాయి.

ఆలయంలోనే పుస్తకాలు

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. కొండపై స్తూపం లేని సమయంలో తాము తెలుగు, హిందీ భాషల్లో రాసిన శ్రీరామకోటి పుస్తకాలను ఎక్కడ ఇవ్వాలో తెలియక ఆలయంతో పాటు ఆలయ పరిసరాల్లో వదిలి వెళ్లేవారు. ప్రస్తుతం శ్రీరామకోటి స్తూపం పూర్తయినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

అస్తవ్యస్తంగా స్తూపం పరిసరాలు

భక్తి భావంతో భక్తులు రాసిన రామకోటి పుస్తకాలను స్తూపం వద్ద సమర్పించేందుకు సిద్ధం చేయగా, స్తూపం పరిసరాలు అస్తవ్యస్తంగా మారాయి. అయినా ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదు. స్తూపం వద్దకు వెళ్లే దారిలో స్టాండ్‌లపై నిత్యం భక్తులు బట్టలు ఆరవేస్తున్నారు. దీంతో ఆ పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. వెంటనే స్తూపాన్ని ప్రారంభించి పరిశుభ్రంగా ఉంచాలని భక్తులు కోరుతున్నారు. స్తూపం ప్రారంభోత్సవం విషయమై ఆలయ ఈవోను ఫోన్‌లో వివరణ కోరగా స్పందించలేదు.

వెంటనే ప్రారంభించాలి



నేను నెలకోసారి కొండగట్టు అంజన్న దర్శనానికి వస్తా. ఎంతో భక్తి భావంతో భక్తులు రాసిన రామకోటి సమర్పించేందుకు కొండపై శ్రీరామకోటి స్తూపం నిర్మించారు. స్తూపాన్ని ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తేవాలి.
– నరేశ్, భక్తుడు, గంగాపూర్

దీర్ఘకాలిక వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు


వైద్యశిబిరంలో పరీక్షిస్తున్న డాక్టర్లు

బుగ్గారం: దీర్ఘకాలిక వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దని ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకుని ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుకోవాలని వైద్యులు సూచించారు. బుగ్గారం మండల కేంద్రంలో శనివారం కరీంనగర్ రెనే ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, వైస్ ఎంపీపీ సుచేందర్, సర్పంచ్ మూల సుమలత, నాయకులు,వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. దీకొండ, ఏడుమోటలపల్లి, నందగిరిలో శిబిరాలు నిర్వహించి సాధారణ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచులు రవినాయక్, రాకేశ్, భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

12న పెగడపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీసాయి క్లినిక్‌లో ఈ నెల 12న గుండె జబ్బుల నిర్ధారణ కోసం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్ఎంపీ వైద్యుడు కుసుమ శంకర్ తెలిపారు. రెనే ఆస్పత్రి కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో గుండె వైద్య నిపుణులు తాటిమల్ల దినకర్‌చే పరీక్షలు జరుపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఫ్రెషర్స్ డే హంగామా


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ధర్మపురి: మండలంలోని మగ్గిడి సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పేరెంట్స్, తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



అరుణాచల దర్శనం సర్వపాపహరణం

కోరుట్ల: అరుణాచల దర్శనం సర్వపాపహరణం అని రుద్రాక్ష గురూజీ ప్రవచించారు. శనివారం కోరుట్లలోని మహాదేవ స్వామి ఆలయాన్ని, అరుణాచల రుద్రాక్ష గురూజీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులతో ఆయన మాట్లాడుతూ, అరుణాచల గిరి ప్రదక్షిణతో ప్రతి ఒక్కరూ పునీతులవుతారన్నారు. అనంతరం అరుణాచలేశ్వర స్వామికి అభిషేకించిన విభూది, రుద్రాక్షలు, చిత్రపటాలు భక్తులకు ఉచితంగా అందించారు. ఆలయ చైర్మన్ గెల్ల గంగాధర్, అర్చకులు భరద్వాజ్‌శర్మ, శ్రీవారి సేవ సమితి ప్రతినిధులు కంటాల రవీందర్, మంచాల జగన్, రామిని శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.